ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
బుధవారం 10 జనవరి 2024

అధికారుల అనాలోచిత పనులతో భూములకు సాగునీరు అందించాలనే లక్ష్యం నెరవేరలేదు. దశాబ్దాల కింద వాగుపై ఆనకట్ట నిర్మించి నీటిని అయ్యవారిపల్లి నల్లచెరువులోకి మళ్లించేందుకు పనులు చేశారు. పైపులతో వేసిన ఆనకట్టతో చెరువు నింపాలనుకున్నా పైపుల కింది నుంచే నీరంతా ప్రవహించింది తప్ప చెరువులోకి చేరలేదు. ఆనకట్టలో సాంకేతిక లోపాన్ని సవరించి చెరువు నింపాలని రైతులు విన్నవించినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. కొత్త ప్రభుత్వం అయినా వాగు నీటిని చెరువులోకి తరలించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. తద్వారా వందలాది ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందని అంటున్నారు.

లక్షలు వెచ్చించినా నెరవేరని లక్ష్యం!


పూడిక, పొదలతో నిండిన భీమారం ఆనకట్ట

30 ఏళ్లుగా చెరువులోకి చేరని వరద నీరు

- సాంకేతిక లోపాన్ని సరిచేయని అధికారులు
- వృథాగా పోతున్న నీరు.. బీళ్లుగా భూములు

షాద్‌నగర్ రూరల్, జనవరి 9: వర్షాధారంగా సాగుచేసే రైతుల కోసం చెరువులు నింపి సాగునీటిని అందించాలని 30ఏళ్ల కింద నిర్మించిన ఆనకట్ట లక్ష్యం నెరవేరకపోవడంతో నేటికీ పొలాలకు నీరందడం లేదు. పథకాన్ని పూర్తిచేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో చిన్న నీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేసిన పి.శంకర్‌రావు హయాంలో అయ్యవారిపల్లి వాగుపై కోటి నిధులు మంజూరు చేయించి ఆనకట్ట నిర్మించారు. కుడి కాలువ నుంచి అయ్యవారిపల్లి నల్లచెరువులోకి నీటిని మళ్లించాలని ప్రణాళిక రూపొందించారు. అందుకోసం చెరువు వరకు కాలువ తవ్వించారు. కాలువ మధ్యలో చిన్నవాగుపై దిమ్మెలు కట్టి నీరు వెళ్లేందుకు పైప్‌లైన్ వేశారు. పైప్‌లైన్‌ను సాంకేతిక లోపంతో వేయడంతో పైప్‌లైన్ కింద మట్టి కొట్టుకుపోయి దాని కిందినుంచి నీరు పారుతోంది తప్పితే నీరు మళ్లడం లేదు. పైప్‌లైన్‌నే ఆనకట్ట వలె వేయాలనుకున్నా ఆ పని వృథాగా మారింది. మట్టి కొట్టుకుపోవడంతో నీరు ముందుకు పారడం లేదు. దీంతో వరద సముద్రంలో చేరుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా పనులు చేయాలేదు. ఎడమ కాలువ నుంచి వరద చించోడులోని బొమ్మ చెరవులోకి మళ్లించాలని ప్రణాళిక వేశారు. ఆనకట్ట నుంచి 100మీటర్ల దూరం కాలు తవ్వి వదిలేశారు. కొందుర్గు మండలం వీరసముద్రం వద్ద పుట్టి జీవనదిగా ప్రవహించే వాగును చెరువులోకి మళ్లిస్తే చెరువు నిండి పంటలు పండించుకోవచ్చని రైతులు ఆశిస్తున్నారు. ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదని వారు అంటున్నారు.


కాలువ మధ్యలో సాంకేతిక లోపంతో నిర్మించిన పైప్‌లైన్

మిషన్ కాకతీయ కింద రూ.23లక్షలతో మరమ్మతులు

బీఆర్ఎస్ ప్రభుత్వంలో అమలు చేసిన మిషన్ కాకతీయలో వరద నీరు చెరువులోకి మళ్లింపునకు రూ.23లక్షలతో మరమ్మతులు చేశారు. కానీ కాలువ మధ్యలో నిర్మించిన పైప్‌లైన్ సాంకేతిక లోపాన్ని సరిచేయలేదు. ప్రస్తుతం చెరువు ఎండిపోయింది. ఇప్పుడే సాంకేతిక లోపాన్ని సరిచేయాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. చెరువులోకి నీరు చేరితే 100ఎకరాలు సాగవుతుందని, గత పాలకులు ఇది సరి చేయలేదన్నారు. ఇప్పటికైనా వదర చెరువులోకి చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిరాదరణకు గురైన భీమారం ఆనకట్ట

నవాబుల కాలంలో 200 ఎకరాలకు నీరందించేలా నిర్మించిన భీమారం ఆనకట్ట దశాబ్దాలుగా నిరాదరణకు గురవుతోంది. ఇంత పెద్ద ఆనకట్ట పూడికతో నిండి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. కంసాన్‌పల్లితో పాటు సూరారంలోని 200ఎకరాలకు ఈ ఆనకట్ట నీరందేది. వీరసముద్రం నుంచి వచ్చే వరద నీటిని నిల్వ చేసేందుకు కూడా దీనిని నిర్మించారు. తూం శిథిలమైంది. కట్ట కింది నుంచి నీరు లీక్ అయి వృథాగా పోతోంది. భూములకు నీరందించే ఆనకట్టలకు మరమ్మతులు చేయించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై, అధికారులపై ఉంది.


నీరు లేని అయ్యవారిపల్లి నల్లచెరువు

చెరువులోకి నీరు చేరేలా చర్యలు తీసుకోవాలి



ఆనకట్ట నిర్మించి సుమారు 30ఏళ్ల అయింది. చిన్న లోపంతో వరద చెరువులోకి పోవడం లేదు. ఆ లోపాన్ని సరిచేసి చెరువులోకి నీరు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– విజేందర్‌రెడ్డి, రైతు, అయ్యవారిపల్లి

చలి పంజా

- వణికిస్తున్న శీతల గాలులు

రంగారెడ్డి అర్బన్, జనవరి 9 : చలి పులి పంజా విసిరింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో శీతల గాలులు వణికిస్తున్నాయి. తెల్లవారు జామున పొగమంచు కమ్ముకుంటోంది. ఉదయం 9 గంటలైనా సూర్యుడు కనిపించడం లేదు. ఎండ కోసం జనాలు పరితమిస్తున్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో 14.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం రెడ్డిపల్లిలో 15.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కేసవరంలో 16.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

ఎన్నికలకు సన్నద్ధం కండి

- రెండు సీట్లు కచ్చితంగా గెలవాలి
- ప్రతీ నియోజకవర్గానికి రూ.10కోట్ల నిధులు
- ఆరు గ్యారెంటీ స్కీమ్‌ల అమల్లో భాగస్వాములు కండి
- ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల, మల్కాజిగిరి స్థానాలను కచ్చితంగా గెలవాలని పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలకు ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. నగరంలోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో మంగళవారం రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్, స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కంటే పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్కువ ఓట్లు సాధించాలన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి తరువాత పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతాయని ఇందుకు అందరూ సన్నద్ధం కావాలని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ స్కీమ్‌లకు విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు వాటి అమల్లో ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, పార్టీ ఇన్‌చార్జీలు భాగస్వాములు కావాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు కృషి చేయాలన్నారు. నిజమైన లబ్ధిదారులకు పథకాలు అందే విధంగా చూడాలన్నారు. ఇందుకోసం ప్రతి నియోజకవర్గానికి రూ.10కోట్ల నిధులు మంజూరుచేస్తున్నట్లు రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రుల పర్యవేక్షణలో ఈ నిధులు వినియోగిస్తామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కోసం ఇందిరమ్మ కమిటీలను వేసి వీటిని పకడ్బందీగా అమలు చేస్తామన్నారు.

జోరుగా వరి నాట్లు

యాచారం, జనవరి 9: మండలంలోని పలు గ్రామాల్లో కొన్ని రోజులుగా యాసంగి వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. యాచారం, నందివనపర్తి, కుర్మిద్ద, చిన్నతూండ్ల తదితర గ్రామాల్లో వరినాట్లు వేస్తున్నారు. యాసంగి పంటలో ఏప్రిల్, మే నెలల్లో వడగండ్లు పడి పంట పాడవుతుందనే భయంతో రైతులు ముందుగానే నాటు వేస్తున్నారు. ఎండలు పెరిగినాకొద్దీ నీటి లభ్యతలోనూ ఇబ్బందులు ఎదురవుతాయనే కారణంతోనూ ముందుగా వరి నాట్లు వేస్తున్నారు. రైతులు ఎరువులు, విత్తనాల కొరతతో ఇబ్బంది పడకుండా సిద్ధం చేశామని సొసైటీ అధికారులు, ఏవో సందీప్‌కుమార్ తెలిపారు. వరి నాట్ల కారణంగా ట్రాక్టర్లకు డిమాండ్ పెరిగింది.


నందివనపర్తిలో వరి నాటు వేస్తున్న కూలీలు

ప్యారాచూట్ లీడర్లు వద్దు!

- ఎంపీ ఎన్నికల్లో స్థానికుడికే అవకాశం ఇవ్వాలి
- మల్కాజిగిరి పార్లమెంటు అభ్యర్థి ఎంపికపై బీజేపీ సీనియర్ నాయకుల మొర

మేడ్చల్ జనవరి9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : దేశంలోనే అతి పెద్ద పార్లమెంటు నియోజకవర్గమైన మల్కాజిగిరి పార్లమెంటు స్థానంలో పోటీకి ఆ పరిధిలోని నాయకులకే అవకాశం ఇవ్వాలని, ప్యారాచూట్ లీడర్లు వద్దని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మేడ్చల్‌రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీశ్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొంపల్లి మోహన్‌రెడ్డి అధిష్ఠానాన్ని కోరారు. ఈ మేరకు వారు మంగళవారం దమ్మాయిగూడ తిరుమల గార్డెన్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయన్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఎంతో మంది నాయకులు 45 ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడుతున్నారని, వారిని అధిష్ఠానం గుర్తించి అవకాశమివ్వాలని కోరారు. నియోజకవర్గ పరిధిలోని కార్యకర్తల, నాయకుల మనోభావాలని పరిగణలోకి తీసుకుని ఎంపీ అభ్యర్థిని ఎంపిక చేయాలన్నారు. మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలోని వ్యక్తికి అవకాశమిస్తే అందరం కలిసికట్టుగా గెలిపిస్తామని వారు స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ ఉండే బీజేపీ నాయకులకు ప్రజల సమస్యలపై పూర్తిగా అవగాహన ఉందని, నిత్యం ప్రజల్లో ఉంటూ ఇప్పటికే పార్టీ కోసం ఎంతో శ్రమించిన వారిని గుర్తించాలన్నారు. నియోజకవర్గంపై అవగాహన లేని వ్యక్తులకు అవకాశమిస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రపంచమంతా నేడు మోదీ వైపు చూస్తున్నదని , మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో వివిధ ప్రాంతాలకు చెందిన వారు నివాసం ఉంటున్నారని, అన్నింటిని దృష్టిలో పెట్టుకుని స్థానికుడికే అవకాశమివ్వాలని అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఘట్‌కేసర్ మండల ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, జిల్లా స్పోక్ పర్సన్ సంపత్ యాదవ్, , నాయకులు తిరుమలరెడ్డి, రవీందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రంగారెడ్డి అర్బన్, మేడ్చల్ రూరల్, మేడ్చల్ పట్టణ జిల్లాల అధ్యక్షులు

లక్ష్యం కోసం కృషి చేస్తేనే ఫలితాలు

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అనితారెడ్డి

- పట్నంలో జిల్లా స్థాయి సైన్స్, మ్యాథమాటిక్స్, పర్యావరణ ప్రదర్శన

ఇబ్రహీంపట్నం, జనవరి 9: విద్యార్థుల్లో ఆలోచన శక్తిని పెంపొందించడంలో ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉంటుందని, ఎవరైనా లక్ష్యం కోసం కృషిచేస్తేనే ఉత్తమ ఫలితాలు వస్తాయని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. విద్యార్థులు మేథస్సుకు పదును పెట్టి లక్ష్య సాధనకు పాటుపడితేనే ఫలితాలు బాగుంటాయని ఆమె అన్నారు. విద్యా వ్యవస్థ బాగుకోసం ప్రజాప్రతినిధులు సహకారం అందించాలని కోరారు. ఇబ్రహీంపట్నంలోని గురుకుల విద్యాపీఠ్ హైస్కూల్‌లో రెండ్రోజులపాటు జరగనున్న 51వ జిల్లా స్థాయి సైన్స్, మ్యాథమాటిక్స్, పర్యావరణ ప్రదర్శన(బాల్ వైజ్ఞానిక్ ప్రదర్శన) మంగళవారం ప్రారంభమైంది. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ ప్రదర్శనలో గురుకుల విద్యాపీఠ్, ఇబ్రహీంపట్నం పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన స్వాగత నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎన్‌సీసీ క్యాడెట్లు, స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో అతిథులు గౌరవ వందనం స్వీకరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమయం చాలా విలువైందని సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లకు దూరంగా ఉండాలన్నారు. అవసరం మేరకే వాటిని వాడాలని ఆమె సూచించారు. ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతికత ఒక్క రోజులో వచ్చింది కాదని, వేల సంవత్సరాల నిరంతర ఆలోచన, తపన, కృషితో అది సాధ్యమైందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సవతుల కల్పనకు ప్రభుత్వం కృషిచేయాలని, విద్యా రంగానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలన్నారు. ఇబ్రహీంపట్నం ఎమెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. సమాజ వికాసానికి విద్యే మూలం అని, విద్యారంగం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. సైన్స్ అంటేనే తెలుసుకోవడం అని, ఒక్క చిన్న ప్రశ్న నుంచే మేధోమథనంతో నూతన ఆవిష్కరణలు రూపుదిద్దుకుంటాయన్నారు. బాల్య దశ నుంచే విశ్లేషనాత్మక ఆలోచనను అలవాటు చేసుకోవాలని, అప్పుడే ఫలితాలు వస్తాయన్నారు. డీఈవో సుశీందర్‌రావు స్వాగతోపన్యాసం చేస్తూ జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో 312 గణిత, వైజ్ఞానిక, పర్యావరణ ప్రాజెక్టులు ప్రదర్శిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కృపేష్, జెడ్పీటీసీ మహిపాల్, మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి, విద్యాపీఠ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్‌రావు, జిల్లా సైన్స్ అధికారి వై.శ్రీనివాస్‌రావు, డీసీఈబీ సెక్రటరీ రామచంద్రారెడ్డి, ఎంఈవోలు కె.వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.


జిల్లా స్థాయి సైన్స్, మ్యాథమాటిక్స్, పర్యావరణ ప్రదర్శన ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, అధికారులు

- వీకెండ్‌లలో గ్రామాల్లో ఆస్వాదిస్తున్న సందర్శకులు
- కుటుంబంతో కలిసి వెళ్లి ఎంజాయ్ చేస్తున్న నగర వాసులు
- ఫామ్ ల్యాండ్స్, రిసార్టులతో పల్లెల్లో సందడి
- పెట్టుబడులకు స్వర్గధామంగా మారిన ప్రాంతం

ప్రకృతి ఒడి..
మంచాల విడిది

గ్రామీణ వాతావరణం కోసం చలో మంచాల

రోజురోజుకూ జనం అభిరుచులను మార్చుకుంటున్నారు. గతంలో సెలవులొస్తే సినిమాలకు, పార్క్‌లకు ప్రాధాన్యం ఇచ్చేవారు. ఇప్పుడు మాత్రం నగర వాసులు సమీపంలోని గ్రామాలకు వెళ్లి ప్రకృతి రమణీయతను ఆస్వాదిస్తున్నారు. ఉదయం వెళ్లి సాయంత్రం వరకు అక్కడే గడుపుతున్నారు. దీంతో హైదరాబాద్ సమీప పల్లెలు పర్యాటకులతో కళకళలాడుతున్నాయి. మంచాల మండలం కొండలు, గుట్టలతో కూడిన ప్రాంతం కావడంతో ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందుతోంది. ఆర్థికంగా ఉన్న వారు వీకెండ్ విడిదికి ఈ ప్రాంతాల్లో ఇళ్లు, గెస్ట్‌హౌస్‌లను నిర్మించుకుంటున్నారు.


ఓ ఫామ్ ల్యాండ్‌లో నిర్మించిన రోడ్డు

మంచాల, జనవరి 9: నగర వాసులకు వారాంతపు, సెలవు రోజుల్లో కాలక్షేపం ఇష్టం. గతంలో సెలవులొస్తే వారు నగరంలోనే సినిమాలు, పార్క్‌లకు వెళ్లేవారు. కానీ నేడు ట్రెండ్ మారింది. జనం అభిరుచులను మార్చుకుంటున్నారు. సెలవులొస్తే సరదాకు గ్రామీణ ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. దీంతో హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో కళకళలాడుతున్నాయి. ఈ క్రమంలో నగరానికి చేరువలో ఉన్న ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాలకు సందర్శకుల సందడి పెరుగుతోంది. మంచాల మండలంలోని వివిధ చోట్ల వారాంతపు విడిదికి ప్రాధాన్యం ఇస్తున్నారు. కుటుంబంతో వచ్చి ఫామ్ ల్యాండ్స్, రిసార్టుల్లో కాలక్షేపం చేస్తున్నారు. తమ ఆర్థికస్థోమతకు అనుగుణంగా ఇక్కడి వెంచర్లు, ఫామ్ ల్యాండ్స్‌లో ప్లాట్లు కొనుగోలు చేస్తున్నారు. ఆ తర్వాత వీకెండ్ విడిదికి సొంతంగా ఇళ్లు, గెస్టుహౌస్‌లు నిర్మించుకుంటున్నారు. ఈ పరిణామం రియల్టర్లకు స్వర్గధామంగా మారింది. దీంతో ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టేందుకు రియల్టర్లు ప్రాధాన్యమిస్తున్నారు. కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా వెంచర్లు, ఫామ్ ల్యాండ్స్, రిసార్టులను ఏర్పాటు చేస్తున్నారు.

ప్రకృతి రమణీయంగా ప్రాంతాలు

మంచాల మండలంలోని గ్రామీణ ప్రాంతాలు ప్రకృతి రమణీయతతో సందర్శకులను కట్టిపడేస్తాయి. కొండలు, గుట్టలతో కూడిన ప్రాంతం కావడంతో ప్రకృతి అందాలను తిలకించేందుకు జనం తరలివస్తున్నారు. లోయపల్లి సెక్టార్ మొత్తం లోయప్రాంతం కావడంతో చుట్టూ కొండలు, మధ్య మైదానం ఊటీని తలపిస్తోంది. రాచకొండ, శ్రీ బుగ్గరామలింగేశ్వర క్షేత్రం, జాపాల-రంగాపూర్ అబ్జర్వేటరీ, బోడకొండ వాటర్ ఫాల్స్ తదితర పర్యాటక కేంద్రాలు సైతం సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. లోయపల్లి సెక్టార్ మొత్తం గిరిజన ప్రాంతం కావడంతో ఇక్కడి తండాల్లో సంప్రదాయ వస్త్రధారణ కనిపిస్తుంది. మంచాల పరిసరాల్లో పట్టణ కల్చర్ ఉంటుంది. ఆరుట్ల సమీపంలోని గ్రామాలు పాడిపంటలతో పల్లె వాతావరణాన్ని ప్రతిబింబిస్తాయి. వీటిని నగర, పట్టణ వాసులు ఎంజాయ్ చేస్తున్నారు.

పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్న జనం

ఇక్కడి భూములకు పెరుగుతున్న ధరలు, పెట్టుబడులతో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు స్వర్గధామంగా మారింది. కొండలు, గుట్టలు, మైదాన ప్రాంతాలు, వ్యవసాయ భూములను కొనుగోలు చేసి వెంచర్లు, ఫామ్ ల్యాండ్స్, రిసార్టులు నెలకొల్పుతూ వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. కస్టమర్ల ఆర్థిక వెసులుబాటుకు అనుగుణంగా గుంటలు, ఎకరాలుగా విభజన చేసి భూమి విక్రయిస్తున్నారు. ఆ తర్వాత స్థోమతను బట్టి గృహనిర్మాణాలు, స్విమ్మింగ్ పూళ్లు, గార్డెన్స్, చిల్డ్రన్ ప్లే ఏరియా నిర్మాణాలు చేసి కస్టమర్లకు అందజేస్తున్నారు. అంతేగాక ఈ నిర్మాణాల్లో రాళ్లు, చెట్లు ఉన్నచోట్ల సహజత్వాన్ని కోల్పోకుండా పరిరక్షిస్తున్నారు.


మంచాల సమీపంలో నెలకొల్పిన ఓ ఫామ్ ల్యాండ్

భూముల కోసం ఫోన్లు చేస్తున్నారు



ఈ మధ్యకాలంలో ఇక్కడి భూములకు రేటు భారీగా పెరిగింది. హైదరాబాద్‌కు దగ్గరగా ఉండడంతో భూములు కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. భూములు చూపించాలంటూ కస్టమర్లు ఫోన్ చేస్తున్నారు. సెలవు రోజుల్లో ఎక్కువ మంది వస్తున్నారు. కొండలు గుట్టలతో ఉన్న భూములు కావాలంటున్నారు. ఎంత దూరంలో ఉన్నా ఎకరానికి రూ.30లక్షలకు తక్కువ లేకుండా ధర ఉంది. బీటీ రోడ్లకు ఆనుకొని పొలం ఎకరం కోటి రూపాయల పైనే ధరలు ఉన్నాయి.

– రాజేష్, బండలేమూర్, రియల్టర్

సెలవుల్లో జనం భారీగా వస్తున్నారు



మా పొలం పక్కనే ఆరుట్ల హిల్స్ ఉంది. ఇక్కడ గుట్టల్లోనే ఫాంల్యాండ్స్ ఏర్పాటు చేశారు. అందులోనే ఇళ్లు కట్టి ఇస్తున్నారు. ఇళ్ల చుట్టూ పచ్చ గడ్డి గార్డెన్ ఉంది. పిల్లలు ఆడుకునేందుకు పరికరాలు ఉన్నాయి. శని, ఆదివారాలు, ఇతర సెలవు రోజుల్లో నగరం నుంచి జనం బాగా వస్తున్నారు. పిల్లలతో వచ్చి సాయంత్రం దాకా గడిపి వెళ్తున్నారు. నా పొలంలో కోళ్లఫాం ఉంది. వచ్చే వాళ్లు చాలామంది భూమి అమ్ముతావా? అని అడుగుతున్నారు.


– బెల్లి గోపాల్, రైతు, చెన్నారెడ్డిగూడ

ఉపాధినిచ్చే సంస్థలను నెలకొల్పాలి



మా గ్రామాల్లో రోడ్లు ఇతర జిల్లాలను కలుపుతూ ఉన్నాయి. మా ప్రాంతం పెట్టుబడులకు అనుకూలంగా ఉంటుంది. ఇక్కడ కాలుష్యకారక పరిశ్రమలు ఏర్పాటు చేయొద్దు. స్థానికులకు ఉపాధినిచ్చేలా సంస్థలు నెలకొల్పాలి. మా ప్రాంతం టౌన్‌షిప్ వెంచర్లకు, ఫామ్ ల్యాండ్స్‌కు అనుకూలంగా ఉంటుంది.

– పి.ఆనంద్, చెన్నారెడ్డిగూడ







ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ | ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి | సినీ ప్లానెట్ - కొంపల్లి
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట | ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఫోరం మాల్ - కూకట్‌పల్లి | ఏషియన్ రాధిక - కాప్రా
ఆర్.కె. - బంజారాహిల్స్ | ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ | ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
గలేరియా - పంజాగుట్ట | మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
ఐకాన్ - హైటెక్‌సిటీ | మిరాజ్ సినిమాస్ - బాలానగర్
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ | మిరాజ్ సినిమాస్ - చందానగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్ | లక్ష్మీనరసింహ - మియాపూర్
ప్రిస్టన్ మాల్ - గచ్చిబౌలి | రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
ఆట్రియమ్ - గచ్చిబౌలి | జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ఎస్‌2 నోమ - మల్లాపూర్ | మూవీటైమ్ - అమీర్‌పేట
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ | ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
ఎం.పి మాల్ - కాచిగూడ | టివోలి - సికింద్రాబాద్
జిఎస్ఎమ్ - మదీనగూడ | విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
నెక్లెస్ సత్వ - కవాడిగూడ | శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ | షా షహెన్‌షా - చింతల్
మంజీరామాల్ - కూకట్‌పల్లి | లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి | మూవీమ్యాక్స్ - మౌలాలి
మంత్రామాల్ - అత్తాపూర్ | జె.పి.సినిమాస్ - చందానగర్
సుధా - శాలిబండ | మరియు
డిఎస్‌ఎల్ మాల్ - ఉప్పల్ | మీ అభిమాన థియేటర్లలో

నిబంధనలను ఉల్లంఘించే..

రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు

● రంగారెడ్డి జిల్లా అదనపు జిల్లా కలెక్టర్ భూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్, జనవరి 9 : నిబంధనలు ఉల్లంఘించే రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం పౌరసరఫరాల శాఖ అధికారులు, ఎఫ్‌సీఐ ఏరియా మేనేజర్లు, రైస్‌మిల్లర్లతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి ప్రభుత్వ పరంగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని త్వరగా మిల్లింగ్ చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కోటాకు అనుగుణంగా ధాన్యం నిల్వలను భారత ఆహారసంస్థకు చేరవేయాలని రైస్‌మిల్లర్లకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రతీ రైస్ మిల్లులో పూర్తి సామర్థ్యానికి అనుగుణంగా కస్టమ్ మిల్లింగ్ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. సీఎంఆర్ కేటాయింపుల్లో జాప్యాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నందున, ఇకపై మిల్లర్ల అలసత్వాన్ని తాము ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. జిల్లాలోని రైస్ మిల్లులలో సీఎంఆర్ కేటాయింపుల పట్ల నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తాము ఎలాంటి సాకులు వినదల్చుకోలేదని, అవసరమైతే ధాన్యాన్ని కొనుగోలు చేసి అయినా నిర్దీత గడువులోపు లక్ష్యానికి అనుగుణంగా సీఎంఆర్ డెలివరీ చేయాలని మిల్లర్లకు తేల్చిచెప్పారు. అవసరమైతే ప్రైవేట్ ధాన్యం మిల్లింగ్‌కు విరామం ఇచ్చి, సీఎంఆర్ లక్ష్యసాధనపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, సాధ్యమైనంత వరకు ఎక్కువ మొత్తంలో బాయిల్డ్ రైస్ నిల్వలు అందించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మిల్లర్లు పంపించే సీఎంఆర్ నిల్వలను వెనువెంటనే దిగుమతి చేసుకునేలా గోడౌన్ల వద్ద కూలీల సంఖ్య పెంచాలని, మిల్లర్లకు కోరిన వెంటనే గోడౌన్లలో బియ్యం దిగుమతి కోసం ఎక్కడ స్థలం అందుబాటులో ఉంటే అక్కడికి మిల్లర్లను అనుమతించాలని సూచించారు. డీఎస్‌వో మనోహర్ రాథోడ్, సివిల్ సప్లయిస్ డీఎం విజయలక్ష్మి, ఎఫ్‌సీఐ ఏరియా మేనేజర్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, రైస్‌మిల్లర్లు, అధికారులు పాల్గొన్నారు.

కుళ్లిన స్థితిలో మహిళ మృతదేహం లభ్యం

● రంగారెడ్డి జిల్లా మంగల్‌పల్లిలో వెలుగుచూసిన ఘటన

ఇబ్రహీంపట్నం, జనవరి 9 : ఇబ్రహీంపట్నం మండలం మంగల్‌పల్లిలో ఓ వ్యవసాయ క్షేత్రంలో గల రేకుల గదిలో మంగళవారం కుళ్లిన స్థితిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. శరీరమంతా నల్లగా మారి ఉబ్బింది. 10-12 రోజుల క్రితమే మహిళ మృతిచెంది ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగల్‌పల్లికి చెందిన కాలె రాజ్‌కుమార్ అదే గ్రామానికి చెందిన గుండ్ల శ్రీశైలం పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఆ పొలంలో ఓ రేకుల షెడ్డు రూం ఉంది. మంగళవారం ఉదయం వ్యవసాయ సామాగ్రికని రాజ్‌కుమార్ గది తలుపుతీసి చూడగా మహిళ మృతదేహం కనిపించింది. దీంతో రాజ్‌కుమార్ వెంటనే పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించి మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి వయస్సు 50-55 సంవత్సరాలు ఉంటుందని, కుడిచేయిపై మూడు స్టార్ గుర్తులు నల్లని, ఎరుపు రంగులో ఉన్నాయని, మెడలో నల్ల, ఎర్ర పూసలు, ఓం గుర్తు లాకెట్‌తో పుస్తెలతాడు ఉందన్నారు. కుడికాలుకు నల్లని దిష్టిదారం, చెవులకు రింగులు ఉన్నాయి. ఎడమ చేతిపై హిందీలో ఓ టాటూ ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోవిందరెడ్డి తెలిపారు.

రోడ్డుపైనే మురుగు..
పట్టించుకోని పాలనా యంత్రాంగం

మొయినాబాద్ రూరల్, జనవరి 9 : మండల పరిధిలోని హిమాయత్ నగర్ గ్రామంలో పారిశుధ్యం లోపించింది. పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం, పాలకవర్గం అలసత్వంతో ఇళ్ల మధ్య, ప్రధాన రహదారులపై నిలుస్తున్న మురుగునీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని నెలలుగా మురుగు నీరు రోడ్లపైనే నిల్వ ఉండటంతో దోమల సంచారం అధికమై రోగాలబారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధి హిమాయత్‌నగర్ గ్రామంలోని సాయిబాబా దేవాలయం ఎదుట, కుమ్మరి బస్తీలోకి వెళ్లే రోడ్డుపక్కన అండర్‌డ్రైనేజీలో మురుగునీటితో పాటు చెత్త పేరుకుపోయిం ది. ఇళ్ల నుంచి వచ్చే నీటితో చిలుకూరుకు వెళ్లే పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



హిమాయత్‌నగర్‌లోని ప్రధాన రోడ్డుపై మురుగు నీరు



బొంరాస్‌పేట్ రైతు వేదికలో ధాన్యం కమిషన్ డబ్బుల విషయంలో మహిళల సమక్షంలో విచారణ చేస్తున్న అధికారులు

ధాన్యం కమిషన్ గోల్‌మాల్‌పై విచారణ

- రూ.2లక్షలు రికవరీ

బొంరాస్‌పేట్, జనవరి 9: ఐకేపీ మహిళలు ధాన్యం కొనుగోలు చేపట్టగా వచ్చిన కమిషన్ పక్కదారి పట్టడంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. మండల పరిధిలోని బురాన్‌పూర్ గ్రామానికి చెందిన మహిళా సంఘాల సభ్యులు రబీ సీజన్ 2019 నుంచి 2023వరకు ధాన్యం కొనుగోలు చేపట్టారు. ఇప్పటి వరకు కమిషన్ విషయానికి వస్తే రూ.9లక్షల 99వేల 49 ప్రభుత్వం నుంచి ఐకేపీ మహిళలకు వచ్చింది. అందులో ఇటీవల బురాన్‌పూర్ ఐకేపీ వీఏన్ఏ కమిషన్ వివరాలను మహిళలకు తెలపకుండా తప్పించుకోవడంతో మహిళలకు అనుమానం వచ్చి ఇటీవల ప్రజావాణిలో విచారణ కోసం దరఖాస్తు చేశారు. అంతకుముందే మండలస్థాయి ఐకేపీ అధికారులకు విచారణ చేపట్టాలని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో నేరుగా డిసెంబరు 18న కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందించారు. ఐకేపీ, ఏపీడీ నర్సింహులు, ఆడిటర్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం బురాన్‌పూర్ గ్రామ మహిళల సమక్షంలో విచారణ చేపట్టారు. అందులో ఇప్పటికే రూ.2లక్షలు ఓ ఉన్నతాధికారి భార్య బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు రుజువు కావడంతో ఆ రెండు లక్షలు రికవరీ చేసినట్లు అధికారులు తెలిపారు. మిగతా సమగ్ర విచారణకు తిరిగి బుధవారం అధికారులు రానున్నట్లు ఏపీయం అంజిలయ్య తెలిపారు.

నేవీ రాడార్ ఏర్పాటుకు కదలిక

- తాజాగా సీఎంవోను సంప్రదించిన నేవీరాడార్ అధికారులు
- కొత్త ప్రభుత్వంలో ప్రాజెక్టు ఏర్పాటుకు కదలిక
- రాష్టానికే తలమానికం కానున్న ప్రాజెక్టు



నేవీరాడార్ ప్రాజెక్టు ఏర్పాటు చేయనున్న పూడూరులోని అటవిప్రాంతం

పరిగి, జనవరి 9: కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన ఇండియన్ నేవీరాడార్ వ్యవస్థకు సంబంధించిన ప్రాజెక్టు ఏర్పాటుకు కదలిక వచ్చింది. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టు తాజా పరిణామాలు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ఈ ఇండియన్ నేవీరాడార్ ప్రాజెక్టు పూడూరు మండలం దామగుండం అటవీప్రాంతం వేదిక కానుంది. నేవీ రాడార్‌కు సంబంధించి నేవీ శాఖ కమాండో కార్తీక్‌శశాంక్ మంగళవారం నేవీరాడార్ ప్రాజెక్టుకు సంబంధించి సీఎంవో అధికారులను సంప్రదించారు. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని కూడా కలిసే అవకాశం ఉందని సమాచారం. ఏడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టు ఏర్పాటుకు మోక్షం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ప్రాజెక్టు ఏర్పాటు తెలంగాణ రాష్టానికే తలమానికం కానుంది ఈ నేవీ రాడార్ ప్రాజెక్టు. ఈ నేవీ రాడార్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం రిజర్వ్ ఫారెస్ట్ ఆధీనంలో ఉన్న 2,934 ఎకరాల భూములను అప్పట్లోనే గుర్తించారు. 2011-12లో ప్రాజెక్టు ప్రక్రియ ప్రారంభం కాగా, 2015లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక అంచనాకు వచ్చాయి. గతంలోనే పలుమార్లు ఇండియన్ నేవీరాడార్ శాఖ అధికారులు దామగుండం దేవాలయ భూములను కూడా తీసుకునేందుకు పూడూరు గ్రామస్తులతో సమావేశం నిర్వహించి అంగీకారం కూడా తీసుకున్నారు. ఆ తర్వాత భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రప్రభుత్వానికి మెలిక పెట్టింది. సికింద్రాబాద్‌లోని బైసన్‌పోలో మైదానం స్థలం ఇస్తే, పూడూరులో నేవిరాడార్‌కు భూములు అప్పగిస్తామని గతంలో కేసీఆర్ ప్రభుత్వం మెలిక పెట్టడంతో కేంద్రరక్షణ శాఖ బైసన్ పోలో మైదానం ఇచ్చేందుకు నిరాకరించింది. దీంతో ప్రాజెక్టుకు సంబంధించి భూముల అప్పగింతకు కేసీఆర్ నిరాకరించడంతో ప్రాజెక్టు ఏర్పాటు పెండింగ్‌లో పడింది. ప్రస్తుతం కొత్త సర్కారు ఏర్పాటుతో కదలిక ప్రారంభమైంది. స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కూడా కొత్త సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా చెప్పడంతో ప్రాజెక్టు ఏర్పాటు ముందడుగు పడినట్లుగా చెబుతున్నారు.

ఇక్కడే ఎందుకు..

వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండం అటవీ శాఖ ప్రాంతం సముద్ర మట్టానికి 360 అడుగుల ఎత్తులో ఉండడంతో నేవీ రాడార్ ప్రాజెక్టు ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందని అధికారులు ఈ ప్రాంతాన్ని ఎంపిక చేశారు. ఎత్తైన ప్రదేశం కావడంతో రాడార్ ద్వారా సముద్రమార్గాన్ని వీక్షించే అవకాశం ఉంది. రాడార్ వ్యవస్థ శత్రుదుర్భేద్యాలకు దూరంగా ఉండాలన్నదే ప్రధాన ఉద్దేశం. దామగుండం అడవులు అందుకు అనుకూలంగా ఉన్నాయని గుర్తించారు. పైగా నేవీ రాడార్‌కు అవసరమైన విశాలమైన స్థలం లభించడం కూడా ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ఇక్కడ నుంచే అంతర్జాతీయ స్థాయిలో నేవీ వ్యవస్థను సిగ్నల్స్ ద్వారా మానిటరింగ్ చేస్తారు. దేశంలో కొన్ని ప్రదేశాలలో మాత్రమే ఉన్న నేవీరాడార్ పూడూరులో ఏర్పాటుకు ఆ శాఖ సన్నహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికీ పూడూరులో ఈ ప్రాజెక్టు ఏర్పాటు కానుండడంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించనుంది.

రూ.2000కోట్లతో భారీ ప్రాజెక్టు

రాష్ట్ర రాజధాని నుంచి సరిగ్గా 60 కిలోమీటర్ల దూరంతో పాటు, సముద్ర మట్టానికి 360 అడుగుల ఎత్తైన ప్రాంతాన్ని ఇండియన్ నేవీ శాఖ ఎంచుకుంది. దామగుండం అటవీ ప్రాంతాల్లో 2,934 ఎకరాలను గుర్తించిన ఇండియన్ నేవీ 2011-12లో ప్రతిపాదనలు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ముందు పెట్టింది. ఇట్టి భూ భాగం రిజర్వ్ ఫారెస్ట్‌కు సంబంధించింది కావడం, అక్కడ పురాతన దామగుంగం రామలింగేశ్వర దేవాలయం ఉండడంతో మొదటల్లో కాస్త అడ్డంకులు ఏర్పడ్డాయి. ఈ భూములను స్వాధీనం చేసుకునేందుకు అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.127 కోట్లు చెల్లించేందుకు అంగీకరించింది. ఇదే సమయంలో పురాతన దేవాలయానికి దారి వదలాలని గ్రామస్తులు మెలిక పెట్టారు. ప్రస్తుతం ఉన్న దేవాలయం అలాగే ఉంచి, పూడూరు గ్రామంలో రూ.5 కోట్లతో కొత్త గుడి నిర్మాణంతో పాటు, అభివృదికి నిధులు ఇస్తామని హామీ ఇచ్చింది. అయితే ఇంతకాలం పెండింగ్‌లో ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు అవరోధాలు తొలగినప్పటికీ భూముల అప్పగింత జాప్యంతో పెండింగ్‌లో పడింది. తాజాగా నేవీరాడార్ వ్యవస్థకు సంబంధించిన ఈ ప్రాజెక్టును ప్రారంభించే ప్రక్రియకు ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించినట్లు తెలిసింది. ప్రాజెక్టు అధికారికంగా ప్రారంభం కావాలంటే పర్యావరణం, అటవీశాఖ, దేవాదాయశాఖ, కాలుష్యనియంత్రణ బోర్డు, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర 16 రకాల అనుమతులతోపాటు, రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటికే ఇండియన్ నేవీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోకి చే 15 రకాల అనుమతులు కూడా పొందినట్లు అధికారవర్గాలు పేర్కొన్నాయి.

నేవీరాడార్ ప్రాజెక్టు ఏర్పాటు కానుంది



కొన్నేళ్ళుగా పెండింగ్‌లో ఉన్న నేవీరాడార్ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టు గురించి సీఎం రేవంత్‌రెడ్డికి వివరించా. భూముల అప్పగింత విషయంలో సానుకూలతను తెలిపారు. రెండువేల కోట్లతో ఈ ప్రాజెక్టు నిర్మించనున్నారు. కేంద్రం నుంచి కూడా దాదాపుగా అన్ని రకాల అనుమతులు వచ్చాయి. ఇక రాష్ట్ర ప్రభుత్వం కూడా సానుకూలతో ఉంది. త్వరలోనే ప్రాజెక్టు ఏర్పాటు పనులు చేపట్టే అవకాశం ఉంది. జిల్లాకు దేశ స్థాయిలో గుర్తింపు రానుంది.

-డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి

సమాజంలో విద్య, వైద్యం అతి ముఖ్యం

- విద్యాభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయం
- భారత మాజీ క్రికెటర్ కపిల్ దేవ్
- ముచ్చింతల్‌లో స్కూల్ బిల్డింగ్ ప్రారంభం



ముచ్చింతల్‌లో పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న కపిల్ దేవ్, జగపతిరావు, పార్వతిరెడ్డి

శంషాబాద్ రూరల్, జనవరి 9: నేడు సమాజంలో విద్య, వైద్యం అతి ముఖ్యమైనవని, అలాగే ఖరీదైనవని భారత మాజీ క్రికెటర్ కపిల్ దేవ్ అన్నారు. శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లో నిర్మించిన జూపల్లి బాలమ్మ మెమోరియల్ మండల పరిషత్ పాఠశాల భవనాన్ని మంగళవారం ఆయన మై హోం గ్రూప్ వైస్‌చైర్మన్ జూపల్లి జగపతిరావు, కృషి ఫౌండేషన్ చైర్‌పర్సన్ పార్వతిరెడ్డిలతో కలిసి ప్రారంభించారు. తాను ప్రారంభించిన ఈ ప్రభుత్వ పాఠశాల నుంచి విద్యార్థులు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తున్నట్టు కపిల్ దేవ్ అన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన వసతుల్లేక పేద విద్యార్థులు చదువులో వెనుకబడుతున్నారని చెప్పారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తయారుచేయాలని కోరారు. విద్యాభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. దేశంలో ఎంతో మంది బాలలు విద్యకు దూరం అవుతున్నారని, అలాంటి వారికి విద్యనందించేందుకు ఉత్తమ స్కూళ్లు అవసరం అని, అందుకు దాతలు ముందుకు రావాలని కపిల్‌దేవ్ కోరారు. స్కూల్ భవన నిర్మాణానికి కృషిచేసిన మైహోం గ్రూప్ సంస్థను ఆయన అభినందించారు. కృషి ఫౌండేషన్ దేశంలో ఏన్నో స్కూళ్లను దత్తత తీసుకుందని పేర్కొన్నారు. విద్యార్థులకు వసతులు కల్పిస్తే విద్యలో రాణిస్తారన్నారు. మైహోం గ్రూప్ వైస్‌చైర్మన్ జగపతిరావు మాట్లాడుతూ... ముచ్చింతల్‌లో మాజీ క్రికెటర్ కపిల్‌దేవ్‌తో ప్రభుత్వ పాఠశాల ప్రారంభింపచేయడం సంతోషంగా ఉందన్నారు. గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అధునాతన వసతులతో పాఠశాల గదులను నిర్మించామన్నారు. కృషి ఫౌండేషన్ చైర్‌పర్సన్ పార్వతిరెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు తెలంగాణలో 7 స్కూళ్లను నడుపుతున్నామని, దేశ వ్యాప్తంగా 75 స్కూళ్లను తాము దత్తత తీసుకున్నామని తెలిపారు. మొత్తం 1.5లక్షల మంది విద్యార్థులను తమ సంస్థ ద్వారా చదివిస్తున్నట్టు చెప్పారు. పాఠశాల చుట్టూ మొక్కలు, ఆట స్థలం, బెంచీలు వంటివి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం డీసీపీగా సునీతారెడ్డి



మహేశ్వరం, జనవరి 9: రాచకొండ పరిధిలోని మహేశ్వం జోన్ డీసీపీగా డి. డి.సునీతారెడ్డి బాధ్యతలు స్వీకించారు. రాష్ట్ర నార్కోటిక్ డ్రగ్స్ కంట్రోల్ డీసీపీగా విధులు నిర్వహించిన డి.సునీతారెడ్డి బదిలీపై మహేశ్వరానికి వచ్చారు. తుక్కుగూడలోని డీసీపీ కార్యాలయంలో మంగళవాం విలేకర్లతో ఆమె మాట్లాడుతూ.. మహేశ్వం జోన్ ఇబ్రహీంపట్నం, మహేశ్వరం ఏసీపీ పరిధుల్లో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషిచేస్తానన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలుకూడా భాగస్వాములు కావాలన్నారు. శాంతి భద్రతలకు ఎవరు విఘాతం కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలను ఎవరు సరఫరా చేసినా వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. సైబర్ నేరాలు, గంజాయి వంటి వాటి నిర్మూలనకు త్వరలో గ్రామాల్లో సదస్సులు నిర్వహించి ప్రజలకు, యువతకు అవగాహన కల్పిస్తామన్నారు.



కేంద్ర పథకాల గురించి వివరిస్తున్న అధికారులు, నాయకులు

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

కొత్తూర్, జనవరి 9: కేంద్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను వినియోగించుకోవాలని, వికసిత్ భారత్ కార్యక్రమం ద్వారా పథకాలు ప్రజలకు చేరువవుతాయని బీజేపీ సీనియర్ నాయకులు ఎర్రవెల్లి నాగరాజుచారి, అమడపురం నర్సింహగౌడ్‌లు అన్నారు. మండల కేంద్రంలోని నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ఏపీజీవీబీ మేనేజర్ జలేజా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు. వ్యవసాయాధికారి గోపాల్, ఏఈవో దీపిక, హెల్త్ సూపర్‌వైజర్ రవికుమార్, బీజేపీ నాయకులు ఉరేందర్, కోస్గి మల్లేష్, ప్రభాకర్‌చారి, శ్రీకాంత్, సందీప్‌సింగ్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల రక్షణకు చర్యలు

- కడ్తాల చెన్నకేశవస్వామి ఆలయ భూములకు ఫెన్సింగ్ వేసిన ఎండోమెంట్ అధికారులు
- అన్యాక్రాంత భూముల స్వాధీనం



ఆలయ భూములను సర్వే చేస్తున్న అధికారులు

కడ్తాల్, జనవరి 9: ఆలయ భూముల రక్షణకు అధికారులు చర్యలు చేపట్టారు. అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకున్నారు. ఆలయ భూముల రక్షణలో భాగంగా ఫెన్సింగ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. కడ్తాలలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి కడ్తాలలో సర్వే నంబర్ 76లో 6.05ఎకరాలు, అన్మాస్‌పల్లి సర్వే నంబర్ 130లో 3.06ఎకరాలు, 120లో 15.3ఎకరాలు, సర్వే నంబర్ 125లో 9.33ఎకరాల చొప్పున భూములున్నాయి. ఈ భూములను ఆక్రమించుకున్నారని ఆరోపణలు రావడంతో అధికారులు రక్షణకు చర్యలు ప్రారంభించారు. ఏడీ సర్వే నిర్వహించారు. మంగళవారం సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ నిర్వాహకుడు ఆంజనేయులుతో కలిసి కంచె పనులను దేవాదాయ శాఖ ఈవో మోహన్ రావు, మైసిగండి ఆలయ ఈవో స్నేహలత ప్రారంభించారు. ఈవో మోహన్ రావు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 120లో ఆక్రమణకు గురైన 1.28ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో 28గుంటల భూమి కూడా అన్యాక్రాంతమైనట్టు గుర్తించామని, రెండుమూడు రోజుల్లో పక్క రైతు పొలానికి సర్వే చేయించి ఆక్రమించిన భూమిని స్వాధీనం చేసుకుంటాం అన్నారు. అలాగే సర్వే నంబర్ 130లో 128గజాల ఆలయ భూమిలో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణాన్ని చేపట్టాడని, 222గజాల్లో అన్మాస్‌పల్లిలో ఆలయ భూమిలో వాటర్ ట్యాంక్, జీపీ కార్యాలయం, స్కూల్ నిర్మించారని తెలిపారు. దీనిపై ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శికి నోటీసు ఇచ్చినట్టు మోహన్‌రావు వివరించారు. సర్వే నంబర్ 125లో ఫెన్సింగ్ వేస్తుండగా సమీప వెంచర్ నిర్వాహకులు అధికారులను అడ్డుకున్నారు. ఈ భూమి తమదని, ఆలయ భూమి కాదని వాదనకు దిగారు. రెండు రోజుల్లో సర్వే చేయిస్తామని, అప్పటి వరకు కంచె వేయొద్దని అధికారులను, ప్రజాప్రతినిధులను రియల్టర్లు కోరారు.



వినతిపత్రం ఇస్తున్న కందుకూరు గ్రామస్తులు

మురుగునీటి సమస్యను పరిష్కరించాలి

కందుకూరు, జనవరి 9 : మండలంలోని కందుకూరు గ్రామంలో నెలకొన్న మురుగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు అధికారులకు విన్నవించారు. కందుకూరు సమీపంలోని నక్కరెడ్డి కుంటలోకి రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా ఏర్పాటు చేసిన మురుగు నీటి కాలువ వల్ల తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతూ గ్రామ అంబేడ్కర్, నవయుగ, మాదిగ జాగృతి సంఘాల సభ్యులు మంగళవారం ఎండీవో వెంకట్రాములు, తహసీల్దార్ కె.గోపాల్, ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. రుచిన్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టు పేరుతో కుంటకు ఆనుకొని వెంచర్ ఏర్పాటు చేశారని, అందులో నుంచి వచ్చే మురుగు నీటిని కుంటలోకి వదులుతున్నారని, దాంతో కుంట కలుషితం అవుతుందన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాలు ఇచ్చిన వారిలో ఆయా సంఘాల నాయకులు కె.రాకేష్, ఎం.శేఖర్, కె.శ్రీకాంత్, కె.చెన్నయ్య, తదితరులు ఉన్నారు.

జాతీయ విద్యావిధానంపై 30న సదస్సు

షాద్‌నగర్, జనవరి 9 : జాతీయ విద్యావిధానం -2020 అంశంపై ఈ నెల 30న జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సహకారంతో రెండు రోజుల పాటు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

'ఆయిళ్ల'కు ఎమ్మెల్సీ ఇవ్వాలి

ఆమనగల్లు, జనవరి 9: పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలని రాష్ట్ర కాంగ్రెస్ సేవాదల్ కార్యదర్శి కానుగుల దశరథం కోరారు. రెండున్నర దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి శ్రీనివాస్‌గౌడ్ అందిస్తున్న సేవలను పార్టీ అధిష్ఠానం గుర్తించాలన్నారు. ఆమనగల్లు పట్టణంలో విలేకరులతో దశరథం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో శ్రీనివాస్‌గౌడ్ క్రియాశీలక పాత్ర పోషించారని అన్నారు. నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు సాగిస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన ఎనలేని కృషి సలిపారని తెలిపారు. గౌడ సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాస్ గౌడ్‌కు ఎమ్మెల్సీ పదవి ద్వారా తగిన న్యాయం చేయాలని దశరథం కోరారు.

ఎమ్మెల్సీ కవితకు నాయకుల ఘన స్వాగతం



షాద్‌నగర్, జనవరి 9 : ఎమ్మెల్సీ కవితకు బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఇటీవల దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆలె వెంకటేశ్వర్‌రెడ్డి సోదరుడు శశివర్ధన్‌రెడ్డి మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పలకరించడానికి మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్ బయలుదేరారు. మార్గ మధ్యలో షాద్‌నగర్ బైపాస్ రోడ్డు మీద ఉన్న ఓ హోటల్ వద్ద ఆగి టీ సేవించారు. ఈ సందర్భంగా జాగృతి నాయకులు ఆమెకు అంబేడ్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. కవిత వెంట మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యుడు మన్నె శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వైభవంగా సహస్ర చండీ మహాయాగం



చండీయాగంలో పాల్గొన్న భక్తులు

కందుకూరు, జనవరి 9 : మండలంలోని పులిమామిడి గ్రామంలో సహస్ర చండీ మహాయాగాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామ శివారులో గల నిఖిల్ చేతన్ కేంద్రం గురూజీ అనిల్‌కుమార్ జోషి ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి మంగళవారం వరకు నిర్వహించిన మహాయాగంలో మండల పరిధిలోని పలు గ్రామాల భక్తులతో పాటు హైదరాబాద్, తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

రేషన్ సరుకులు సక్రమంగా అందించాలి

ఆమనగల్లు, జనవరి 9 : ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న నిత్యావసర సరుకులను డీలర్లు వినియోగదారులకు సకాలంలో అందించాలని ఆమనగల్లు మున్సిపల్ కౌన్సిలర్ రాధమ్మ వెంకటయ్య కోరారు. ఆమనగల్లు మున్సిపాలిటీ సంకటోనిపల్లి గ్రామానికి నూతనంగా మంజూరైన రేషన్ దుకాణాన్ని డీలర్ మాధవి మహేశ్, మాజీ ఎంపీపీ ధనుంజయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీపాల్‌తో కలిసి రాధమ్మవెంకటయ్య మంగళవారం ప్రారంభించారు. కాగా, గ్రామంలో రేషన్ దుకాణం ప్రారంభం కావడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు అనంత రాములు, యాదగిరి, కిష్టయ్య, మమేశ్, కమటం రవి, నిరంజన్, శివ, యాదయ్య, నరేశ్, భాస్కర్, వెంకటయ్య, లక్ష్మమ్మ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు తోడ్పాటునందించాలి

తలకొండపల్లి, జనవరి 9: అంతరించిపోతున్న గ్రామీణ కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మండలంలోని వెల్జాలలో సంక్రాంతిని పురస్కరించుకొని గ్రామీణ కళాకారుల ప్రదర్శన నిర్వహించారు. కళాకారులకు శ్రీనివాస్ యాదవ్ రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. కళాకారులకు ప్రభుత్వం తోడ్పాటునందించాలన్నారు. సర్పంచ్ సంగీత, నాయకులు యాదయ్య, శ్రీకాంత్ యాదవ్, శ్రీశైలం, సుధాకర్, అభిలాష్, వెంకటయ్య, పరందాములు, వెంకట్, సత్యం, తదితరులు ఉన్నారు.

మండల సభలు సమస్యల పరిష్కార వేదికలుగా నిలవాలి

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- వాడీవేడిగా ఆమనగల్లు మండల సమావేశం
- పాల్గొన్న ఎంపీ పోతుగంటి రాములు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జనవరి 9: మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాలు ప్రజా సమస్యల పరిష్కార వేదికలుగా నిలువాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం చేసి ప్రజా ప్రతినిధులు, అధికారులు బాధ్యతాయుతంగా మసులుకొని ప్రజల అభిమానం చూరగొనాలని ఆయన కోరారు. ఆమనగల్లు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ నేనావత్ అనిత విజయ్ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించారు. సమావేశానికి ఎంపీ పోతుగంటి రాములు, ఎమ్మెల్యే కసిరెడ్డి, జడ్పీటీసీ అనురాధపత్యనాయక్, పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్, వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డిలు హాజరయ్యారు. ఎమ్మెల్యేగా ఎన్నికై తొలిసారిగా సమావేశానికి హాజరైన కసిరెడ్డిని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. సమావేశం ప్రారంభం కాగానే శాఖలవారీగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పలుమార్లు కొందరు సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కొందరు సభ్యులు పరస్పర విమర్శలకు దిగారు. సభ్యులు సభా మర్యాదలను కాపాడుతూ ఉన్నతంగా వ్యవహరించాలని, సమావేశాలు సవ్యంగా సాగేలా నడుచుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి పలుమార్లు వారించారు. కేఎల్ఐ డీ-82 కాల్వ నిర్మాణానికి భూములు కోల్పోయిన నిర్వాసిత రైతులకు రావల్సిన రూ.16 కోట్లు పరిహారం ప్రభుత్వ పరంగా వెంటనే అందేలా చూడాలని, అసంపూర్తి పనులు పూర్తి చేయించాలని పోలెపల్లి ఎంపీటీసీ కుమార్ సభలో ప్రస్తావించారు. సీఎం దృష్టికి తీసుకుపోయానని.. వీలైనంత త్వరగా పరిహారం అందేలా చూస్తామని ఎమ్మెల్యే సమాధానం ఇచ్చారు. జంగారెడ్డిపల్లి-చంద్రాయన్‌పల్లి బీటీ రోడ్డు పూర్తిగా పాడై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, పాడైన రోడ్డుతో ఇప్పటికే నలుగురు మృతి చెందారని చెన్నంపల్లి సర్పంచ్ పబ్బతి శ్రీనయ్య సభలో పేర్కొనగా.. టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని ఏఈ రవితేజ తెలిపారు. పోలెపల్లి గేటు నుంచి ఆకుతోటపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి టెండర్ పూర్తైన పనులు చేపట్టడం లేదని ఎంపీటీసీ కుమార్ తెలుపగా కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు ప్రారంభింపజేస్తామని ఏఈ సమాధానం ఇచ్చారు. పాఠశాలల్లో స్వీపర్ పోస్టులు లేక ఇబ్బందులు కలుగుతున్నాయని పోలెపల్లి సర్పంచ్ బాల్‌రామ్ పేర్కొనగా.. పోస్టుల భర్తీకి తీర్మానం చేశారు. మేడిగడ్డ, ఆకుతోటపల్లిలోని సమస్యలను సర్పంచ్‌లు అమర్‌సింగ్, రజిత, కో-ఆప్షన్ సభ్యుడు హాజిపాషాలు సభ దృష్టికి తెచ్చారు. ఆమనగల్లు కళాశాల భవన పనులు పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని జడ్పీటీసీ అనురాధపత్యనాయక్ కోరారు. చెన్నంపల్లిలో కోతుల బెడదను నివారించాలని, బెల్టుషాప్‌లను నిరోధించాలని సర్పంచ్ శ్రీనయ్య పేర్కొన్నారు. మంగళపల్లి- చెన్నారం వంతెన నిర్మాణం పనులు వెంటనే ప్రారంభించాలని వైస్ ఎంపీపీ సూచించారు. ఆమనగల్లు ఆసుపత్రిని వంద పడకలకు పెంచి విశాల భవనం నిర్మిస్తామని, కళాశాల భవన అసంపూర్తి పనులు పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే చెప్పారు. ఎంపీ మాట్లాడుతూ ఈజీఎస్ పనులను సద్వినియోగం చేసుకోవాలని, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

పీఏసీఎస్ స్థలం కేటాయింపునకు వినతి

ఆమనగల్లు పీఏసీఎస్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి మండల పరిషత్ ఆవరణలో స్థలం కేటాయించాలని చైర్మన్ వెంకటేశ్ ఎమ్మెల్యేను కోరారు. వైస్ చైర్మన్ సత్యం, సీఈవో దేవేందర్, పలువురు డైరెక్టర్లతో కలిసి ఎమ్మెల్యే, ఎంపీపీ అనితవిజయ్‌లకు వినతిపత్రం ఇచ్చారు. ప్రస్తుతం కార్యాలయం కొనసాగుతున్న భవనం సమీపంలో 600 గజాల స్థలం కేటాయించాలన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలి



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జయమ్మ

శంషాబాద్, జనవరి 9 : అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాలు పంచుకోవాలని ఎంపీపీ దుద్యాల జయమ్మ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో ఇప్పటివరకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని.. ఇకముందు కూడా మరిన్ని పనులు చేపడతామని అన్నారు. రాబోయే రోజుల్లో అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని సభ్యులకు సూచించారు. జడ్పీటీసీ నీరటి తన్వీరాజు మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలో ఉన్నా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. అంతకుముందు అధికారులు తమ శాఖలకు సంబంధించిన ఎజెండాను చదివి వినిపించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచులు మాట్లాడుతూ తమ గ్రామాల్లో సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీడీవో వసంతలక్ష్మి, ఎంపీవో ఉషాకిరణ్‌లతో సర్పంచ్‌లు వి.సతీష్, మహేందర్‌రెడ్డి, రాజ్‌కుమార్, రాంగోపాల్, కల్పనా సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



స్టడీ మెటీరియల్‌అందిస్తున్న మర్రి నిరంజన్‌రెడ్డి

యాచారం, జనవరి 9 : ప్రభుత్వ బడులను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పీసీసీ సభ్యుడు మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గున్‌గల్, యాచారం, నందివనపర్తి, మేడిపల్లి, చిన్నతూండ్ల, కుర్మిద్ద, మాల్, చింతపట్ల, కొత్తపల్లి, గున్‌గల్ మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. పేద విద్యార్థులకు ఎలాంటి ఆపద వచ్చినా ముందుండి ఆదుకుంటామన్నారు. ప్రధానోపాధ్యాయులు, నాయకులు దెంది రాంరెడ్డి, ఉప్పల భాస్కర్‌గుప్త, కె.శ్రీనివాస్‌రెడ్డి, జంగారెడ్డి, లేకుల కమలాకర్‌రెడ్డి, బూర శివగౌడ్ తదితరులున్నారు.

హరిహర అఖండ క్షేత్రం అభివృద్ధికి కృషి



హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, విద్యారణ్య భారతి స్వామి

ఇబ్రహీంపట్నం, జనవరి 9 : మండల పరిధిలోని పెద్ద చెరువు కొనకట్ట సమీపంలో గల శ్రీ హరిహర అఖండ క్షేత్రం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం క్షేత్రంలో 13వ మాసం పవనమాన హోమం, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమంలో ఎమ్మెల్యే, శ్రీ విద్యారణ్య భారతి స్వామీజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక్కడ ఏర్పాటు చేయబోయే 108 అడుగుల హనుమాన్ విగ్రహానికి తన వంతుగా సహకారం అందిస్తానన్నారు. ఇది తెలంగాణలోనే ఒక గొప్ప క్షేత్రం కావాలని ఆకాంక్షించారు. ఈ క్షేత్రానికి అవసరమయ్యే ప్రభుత్వ భూమిని కేటాయించేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడతానన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ భూపతిగళ్ల మహిపాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, హరిహర అఖండ సమితి వ్యవస్థాపకుడు పదా వెంకట్‌రెడ్డి, సభ్యులు రమేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న విజయ్‌కుమార్

షాబాద్, జనవరి 9 : విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని రాష్ట్ర హాకీ చైర్మన్ కొండ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం షాబాద్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో పీఆర్టీయూ షాబాద్ మండల క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. పీఆర్టీయూ మండలాధ్యక్షుడు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నర్సింహులు, జీహెచ్‌ఎం గోవింద్, ఉపాధ్యాయులు రియాజ్, అంజయ్య, జయరాజ్, రవీందర్, ఖాజాపాష, ఆంజనేయులు, రాము, సునీత తదితరులున్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కడ్తాల్, జనవరి 9 : ప్రభుత్వ పథకాలను చెంచులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ ముంతాజ్‌లు సూచించారు. చెంచుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. కడ్తాల మండలం ఎక్వాయిపల్లి, మాదావపురం, ముద్విన్, గ్రామాలలో మంగళవారం ప్రధాన మంత్రి జన జాతీయ ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కార్యక్రమంపై చెంచులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు జంగ సుగుణ సాయిలు, నక్కపోతు యాదయ్య ల అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, కిసాన్ క్రెడిట్ కార్డు, రైతు భరోసా, రైతు బీమా పథకాల గురించి మండల అధికారులు వివరించారు. ఆయా పథకాలు రానివారు, ఆధార్, బ్యాంక్ అకౌంట్, ఓటర్ కార్డు, లేని వారు వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. చెంచుల ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సిబ్బంది వారికి ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ లు ఉమావతి బుగ్గయ్యగౌడ్, నిర్మలాదేవి, ఏపీఎం రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **కడ్తాల్** : గోవిందాయిపల్లిలో యువజన సంఘాల సభ్యులకు క్రికెట్, వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ రవీందర్, ఉపసర్పంచ్ ఎల్లయ్యలు కిట్లను యువజన సంఘాలకు అందజేశారు.
- **షాబాద్** : స్వామియే శరణం అయ్యప్ప అంటూ చందన్‌వెళ్లి గ్రామం మార్మోగింది. మండల పరిధిలోని చందన్‌వెళ్లిలో పడిపూజకు పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు చేవెళ్ల స్వామి, వెంకటేష్, రవీందర్‌నాయక్, యాదయ్య, సుభాష్‌రెడ్డి, దయాకర్, కిషోర్‌నాయక్, కృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, యాదయ్య, మైపాల్‌రెడ్డి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.
- **శంషాబాద్** : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోనిని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పీఆర్టీయూటీఎస్ క్యాలెండర్, డైరీని మండల విద్యాధికారి రాంరెడ్డి ఆవిష్కరించారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు జీఎంఎం మధుకర్, గోపాల్, పీఆర్టీయూటీఎస్ మండలాధ్యక్షుడు బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, జిల్లా, మండల అధ్యక్షులు వెంకటయ్య, భాస్కర్, మల్లేషం, రాములు, శ్రీనివాస్‌రెడ్డి, గణేశ్, బాల్‌రాజ్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల ఊరేగింపు

మాడ్గుల, జనవరి 9 : అయోధ్య అక్షింతలతో మంగళవారం మండలంలోని నర్సాయపల్లి గ్రామంలో ఎంపీటీసీ కొత్త పాండ్ గౌడ్ ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. సర్పంచ్ శ్రీకాంత్, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, రామభక్తులు పాల్గొన్నారు. గ్రామంలోని హనుమాన్ ఆలయంలో అక్షింతలకు పూజలు చేసి ఊరేగించారు. కదారి రమేష్ యాదవ్, రెడ్డి ముత్యపురెడ్డి, చిక్కుడు వెంకటయ్యరెడ్డి, సురేందర్‌రెడ్డి, ముక్కెర రాములు, రెడ్డి తిరుపతిరెడ్డి, కదారి అంజయ్య, ప్రవీణ్, ప్రశాంత్, దర్శన్, రాజులు పాల్గొన్నారు.



ఊరేగింపులో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

చేవెళ్ల, జనవరి 9 : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పీఆర్టీయూ చేవెళ్ల మండల శాఖ ఆధ్వర్యంలో ఎంఈవో అక్బర్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయులు మొహరున్నీసా, రమణారెడ్డి, శ్రీనివాస్, పురందాస్, మండల శాఖ అధ్యక్షుడు సత్తయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, సంఘం బాధ్యులు జనార్దన్‌రెడ్డి, కృష్ణగౌడ్, జయకృష్ణ, శివకుమార్, రామచంద్రయ్య, వేణు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

సర్వాయి పాపన్న విగ్రహం ధ్వంసం చేయటం అమానుషం

మాడ్గుల/ఆమనగల్లు, జనవరి 9 : దళిత, బహుజన విప్లవవీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ధ్వంసం చేయటం అమానుషమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని అవురుపల్లిలో మంగళవారం ఎమ్మెల్యే ఇటీవల గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసిన సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని సందర్శించి పరిశీలించారు. గ్రామస్తులతో ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని పోలీసులకు సూచించారు. సుద్దపల్లి సర్పంచ్ వెంకటేశ్వర్లుగౌడ్, అవురుపల్లి మాజీ సర్పంచ్ నారాయణగౌడ్ తదితరులున్నారు. అదే విధంగా ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం పీఆర్టీయూటీఎస్ క్యాలెండర్‌ను సంఘం అధ్యక్షుడు పూజారి సుదర్శన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, పీఆర్టీయూ నేతలతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

క్రైం కార్నర్

వృద్ధ మహిళ.. నిలువు దోపిడీ

- ఆటో ఎక్కిన ప్రయాణికురాలి వద్ద ఆటోడ్రైవర్ నిర్వాకం
- 2 తులాల పుస్తెలతాడు, రూ.5వేల నగదు, సెల్‌ఫోన్ లాక్కున్న వైనం
- ఆలస్యంగా వెలుగులోకి.. పోలీసులకు ఫిర్యాదు చేసిన వృద్ధురాలు

మంచాల, జనవరి 9: ఓ వృద్ధ మహిళ వద్ద రెండు తులాల బంగారం, రూ.5వేల నగదు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లిన ఆటోడ్రైవర్ నిర్వాకం మండల పరిధిలో వెలుగుచూసింది. కాగా, నిందితుడి కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. సంగారెడ్డి జిల్లా లింగంపేట మండలం సంగారెడ్డిపేటకు చెందిన కొప్పూరు లక్ష్మి కొంతకాలంగా మీర్‌పేట్‌లో ఉంటున్న తన చిన్న కూతురు వద్ద ఉంటోంది. కాగా, పింఛన్ డబ్బుల కోసమని నాలుగు రోజుల క్రితం సొంతూరు సంగారెడ్డిపేటకు వెళ్లింది. డబ్బులు తీసుకున్న ఆమె ఈనెల 7న సంగారెడ్డిలో బస్సు ఎక్కి అదేరోజు సాయంత్రం 4.30 ప్రాంతంలో ఎంజీబీఎస్‌లో దిగింది. ఓ ఆటోడ్రైవర్ ఆమెను మీర్‌పేట్‌లో దించడానికి రూ.200లకు బేరం కుదుర్చుకున్నాడు. ఆమెను మూడు గంటలపాటు ఆటోలో అటూఇటూ తిప్పి గుర్తుతెలియని ప్రదేశానికి తీసుకెళ్లాడు. అనంతరం ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తెలతాడు, రూ.5వేల నగదు, సెల్‌ఫోన్ లాక్కొని అక్కడే వదిలేసి పారిపోయాడు. ఆమె ఎలాగోలా ఆర్టీసీ బస్సెక్కి మంచాల మండలం రంగాపూర్‌లో దిగింది. స్థానికుల సాయంతో మంచాల పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు ఆ వృద్ధురాలి నుంచి వివరాలు తీసుకుని మీర్‌పేట్‌లోని కూతురికి అప్పగించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దోపిడీకి పాల్పడిన ఆటోడ్రైవర్ కోసం గాలిస్తున్నట్లు సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు.

ఇంట్లో చోరీ.. బంగారు, వెండి వస్తువులు అపహరణ

కేశంపేట, జనవరి 9: మండల పరిధిలోని మంగళగూడ గ్రామంలో మంగళవారం చోరీ జరిగింది. గ్రామానికి చెందిన కొట్టం నారాయణరెడ్డి ఇంట్లో దొంగలు చొరబడి 2 బంగారు గొలుసులు, బంగారు పుస్తెలతాడు, రెండు బంగారు ఉంగరాలు, రెండు వెండి చెంబులు, ఒక వెండి కలషం ఎత్తుకెళ్లారని ఎస్ఐ బీఎస్ఎస్ వరప్రసాద్ తెలిపారు. వాటి విలువ దాదాపు రూ.6లక్షలు ఉంటుందని తెలిపారు. నారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

వ్యక్తిని ఢీకొన్న ట్రాక్టర్.. తీవ్ర గాయాలు

యాచారం, జనవరి 9 : ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి చేయి విరిగింది. మండలంలోని మాల్‌కు చెందిన పెంటయ్య లూనా(ద్విచక్రవాహనం)పై సోమవారం సాయంత్రం పొలం వద్దకు వెళుతున్నాడు. ఈక్రమంలో వెనకాల నుంచి వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో లూనాపై నుంచి పెంటయ్య కిందపడ్డాడు. దాంతో అతడి చేయి విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కుటుంబికులు నగరంలోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌దే విజయం



మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్, జనవరి 9 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీదే విజయమని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని 'వి' కన్వెన్షన్‌హాల్లో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో జరిగే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకోసం కార్యకర్తలు మరింత కృషి చేయాలని సూచించారు. పార్టీ గెలుపు కోసం కృషిచేసిన ప్రతి ఒక్క నాయకుడికి సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకే ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. కార్యకర్తలు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండు ఎంపీ స్థానాలను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేశంపేట జడ్పీటీసీ విశాలాశ్రవణ్‌రెడ్డి, కొత్తూరు మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలరాజుగౌడ్, నాయకులు బాబర్‌ఖాన్, తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

ఓపెన్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చేవెళ్ల, జనవరి 9 : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో మూడు సంవత్సరాల బీఏ, బీకాం, బీఎస్సీ, డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెగ్యులర్ ఇంటర్మీడియట్, ఐటీఐ, ఓపెన్ ఇంటర్ పాసైన విద్యార్థులు, పాలిటెక్నిక్ ఐటీఐ రెండేళ్ల డిప్లొమా కోర్సులు పాసైన విద్యార్థులు డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి అర్హుల, ఈనెల 8నుంచి 31వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశముందన్నారు. ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రావిరాలలో ఘనంగా ఉర్సు



ఉత్సవాల్లో ముస్లిం మత పెద్దలు

మహేశ్వం, జనవరి 9 : తుక్కుగూడ మున్సిపాలిటీలోని రావిరాలలో గల దర్గాలో సోమవాం రాత్రి ఉర్సు వేడుకలుల ఘనంగా జరిగాయి. వికారాబాద్, మహబూబ్‌నగర్, హైదాబాద్‌తో పాటు మహేశ్వరం తదితర ప్రాంతాల నుంచి తరలివచ్చిన పలువురు ముస్లిం మత పెద్దలు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మహ్మద్, నవాజ్‌ఖాద్రీ, ఎంఏ సమీర్, సాబెర్ హుస్సేనీ, సయ్యద్ ఆరిఫ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుచేయాలి

- షాద్‌నగర్ ఉద్యానవన శాఖాధికారి ఉషారాణి

కొందుర్గు, జనవరి 9: రైతులు అధిక ఆదాయాన్ని ఇచ్చే ఆయిల్‌పామ్‌ను సాగు చేయాలని షాద్‌నగర్ ఉద్యానవన శాఖాధికారి ఉషారాణి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఆయిల్‌పామ్ సాగు, ఉద్యానవన పంటలపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంట అనేది నూనెల పంట అని, దీనికి మార్కెట్‌లో ఎప్పుడూ డిమాండ్ ఉంటుందని, ప్రతీ సంవత్సరం లక్ష కోట్ల ఖర్చుతో విదేశాల నుంచి నూనెలను దిగుమతి చేసుకుంటున్నామని, ఆ పరిస్థితి రాకుండా నూనె పంటలను పండించాలని కోరారు. ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన తరువాత 4 ఏళ్ల నుంచి కాపు మొదలై 30 సంవత్సరాల వరకు నిరంతరం దిగుబడి వస్తుందన్నారు. ఆదాయం కూడా నిరంతరంగా వస్తుందని తెలిపారు. మొదటి సంవత్సరం ఆదాయం కోసం సోయాబీన్, వేరుశనగ, పసుపు, నువ్వులు, ఆవాలు, జామ, అరటి, మినుము, కూరగాయల పంటలను అంతర పంటలుగా సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఆయిల్ పామ్ పంటకు తెగుళ్ళు, చీడపీడలు వంటివి ఇతర పంటలతో పోలిస్తే చాలా తక్కువని, తుపాన్, వడగండ్లు, ఇతర ప్రకృతి వైపరీత్యాలను సైతం తట్టుకుంటుందని వివరించారు. రంగారెడ్డి జిల్లాలో 5,500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యంగా పెట్టుకున్నామని, షాద్‌నగర్ డివిజన్‌లో 1,500 ఎకరాల్లో సాగు చేయడం లక్ష్యం కాగా, కొందుర్గు మండలంలో 228 ఎకరాల్లో సాగు చేయడం కోసం 44 మంది రైతులు రిజిస్టర్ చేసుకోవడం జరిగిందని, వీరిలో ఏడుగురు రైతులకు సంబంధించి 31.5ఎకరాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఒక ఎకరానికి త్రిభుజాకారంలో 57 మొక్కలను నాటాలని, దీనికి గానూ ఒక్క మొక్కకు ధర రూ.193 కాగా, రాయితీపై 20 రూపాయల చొప్పున 8,650 రూపాయల రాయితీ లభిస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం రాయితీ 5 ఎకరాల్లోపు ఓసీ, బీసీ రైతులకు 90 శాతం, 5 ఎకరాలపైన ఓసీ రైతులకు 80 శాతం రాయితీతో డ్రిప్ ఇవ్వడం జరుగుతుందన్నారు.